# మానవత్వం చచ్చిపోలేదు

- బులుసు రాధాకృష్ణమూర్తి

"ఏమండీ మనిద్దరం ఉద్యోగాలు చేస్తున్నాము కాబట్టి, ఇన్నాళ్ళూ మనకి పిల్లలు లేకపోయినా ఏదో గడిచిపోయింది. ఇప్పుడేమో మీరు రిటైరైపోతున్నారు. నేను బ్యాంక్‌కి వెళ్ళిపోతాను. మీకెలా తోస్తుందో ఏమిటో నాకు భయంగా వుందండీ" పార్వతి, రాజశేఖరంగారికి దగ్గరగా జరుగుతూ తన ఆవేదనంతా వెళ్ళగక్కింది.

"ఒక పని చేస్తావా?" నవ్వుతూ అడిగారు రాజశేఖరంగారు.

"చెప్పండి. మీరు చెప్పడం నేను చేయకపోవడమూనా!" ఆప్యాయంగా అంది పార్వతి.

"నువ్వు వాలంటరీ రిటైర్‌మెంట్ పెట్టకూడదూ" అడిగారు రాజశేఖరం గారు.

"మనం ఇప్పటివరకూ సంపాదించింది చాలు. మనకి శుభ్రమైన ఈ ఇల్లు వుంది. మనకింక ఎవరున్నారని నువ్వింకా ఆరోగ్యం పాడు చేసుకుని కష్టపడాలి చెప్పు. నువ్వు కూడా ఈమధ్య మునుపున్నంత హుషారుగా ఉండడంలేదు. చాలా నీరసంగా కనబడుతున్నావు" ఎన్నాళ్ళనుండో తన మనసులోనే దాచుకున్న అభిప్రాయాల్ని ఈవేళ మనసు విప్పి చెప్పేసారు రాజశేఖరంగారు.

"అవునండీ! నేనూ అదే ఆలోచిస్తున్నాను. నేను కూడా బ్యాంక్‌కి వెళ్ళిపోతే మీకు భోజనం పెట్టేవారెవరుంటారు? మీ ఆలనా పాలనా చూసే వారెవరుంటారు?" అడిగింది పార్వతి.

"సరేలే పడుకో. తరువాత ఆలోచించుకోవచ్చు" అంటూ నిద్రకుపక్రమించాడు రాజశేఖరం.

కానీ పార్వతికి ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. తన జీవితం ఇప్పుడు ఒక మలుపు తిరగబోతోంది. ఇన్నాళ్ళూ జరిగింది ఒక ఎత్తు, ఇకపై జీవితం మరో ఎత్తు. పిల్లలు లేకపోయినా, ఇద్దరూ బ్యాంక్‌లో పని చేస్తుండడంవలన ఉదయం లేవడం, ఆదరాబాదరగా వంట పూర్తి చేయడం, ఇద్దరికీ భోజనం క్యారేజీలో సర్దడం, ఇద్దరూ కలసి స్కూటరు మీద వెళ్ళడం, లంచ్ టైంలో బ్యాంకు డైనింగ్ రూములో కలసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయడం, మళ్ళీ ఇద్దరూ సాయంకాలం కలసి స్కూటరు మీద రావడం, హాయిగా వేడివేడిగా కాఫీ రిలాక్సింగ్‌గా త్రాగుతూ రోజంతా పడిన శ్రమ మరచిపోవడం, మళ్ళీ వంట, టీవీ సీరియల్స్ చూడడం, ఆ రోజు పేపరు తిరగేయడం, పేపరు విశేషాలు ఇద్దరూ డిస్కస్ చేసుకోవడం, ప్రక్కమీదకు జారిపోవడం ఇదే వారి దైనందిన జీవితం. శనివారం బ్యాంకుకి హాఫ్‌డే కావడంవలన సాయంత్రం ఏ సినిమాకో, స్నేహితులింటికో, బజారుకో వెళ్ళడం, ఆదివారం హాయిగా ఇంట్లోనే గడపడం... ఇలా గడిచిపోయాయి రోజులు, సంవత్సరాలు. కొన్నిసార్లు ఇద్దరికీ చెరో బ్రాంచీలో వేయడంవలన భర్త తనను తన బ్యాంక్ దగ్గర డ్రాప్ చేయడం, వచ్చేటప్పుడు మళ్ళీ తనను పికప్ చేసుకోవడం జరిగిపోయేది. రాజశేఖరంగారు ఇంట్లో అన్ని పనుల్లోనూ తనకి ఎంతో చేదోడువాదోడుగా ఉండేవారు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా కాని తనకు అలసట అనేది ఉండేదికాదు. ఒక్క పిల్లలు లేరన్న బాధతప్ప, జీవితం ఎంతో హాయిగా, సరదాగా గడిచిపోయింది. రాజశేఖరంలాంటి భర్త తనకి దొరికినందుకు ఎంతో మురిసిపోతూండేది తను. బ్యాంకు ఇచ్చే ఎల్‌టిసి మీద ఒక్కొక్కసారి ఒక్కో ప్రదేశానికి చిలకాగోరింకల్లా వెళ్ళి ఎంజాయ్ చేసేవారు. ఆ రోజులు మళ్ళీ రావు. కాలచక్రం ఎంత స్పీడుగా గిర్రున తిరిగిపోయింది! కానీ ఎవరింటికేనా వెళ్ళినప్పుడు వాళ్ళ పిల్లల్ని చూసినప్పుడు, పిల్లలులేని లోటు తెలిసేది తనకి. లోలోపలే ఎంతో బాధపడుతూ ఉండేది. కానీ రాజశేఖరంగారి ఊరట తనకి కొండంత ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, మనోస్థైర్యాన్ని ఇచ్చేది. జీవితం ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగిపోయేలా చేసింది.

అర్ధరాత్రి మంచి గాఢనిద్రలో వున్న భర్తను లేపి "ఏవండీ" అని పిలిచింది పార్వతి. ఉలిక్కిపడి లేచాడు రాజశేఖరంగారు.


"ఏం పార్వతీ! ఏమిటి నువ్వింకా నిద్రపోలేదా? నేనేదో సరదాకంటే నువ్వింకా అదే ఆలోచిస్తున్నావా పిచ్చిదానిలా!" కసిరారు రాజశేఖరంగారు.

"లేదండీ. నేను వాలంటరీ రిటైర్‌మెంట్ అప్లికేషన్ రేపే ఇచ్చేస్తాను. ఆ నిర్ణయం మీతో చెబుదామనే..." నసిగింది పార్వతి.

"పిచ్చి పారూ! దీనికోసం పడుకోవడం మానేయ్యాలా! సరే! నీ ఇష్టం. నీకెలా బాగుంటుందనిపిస్తే అలా చెయ్యి" అని మళ్ళీ అటు తిరిగి పడుకున్నారు రాజశేఖరంగారు. ఇప్పుడు ప్రశాంతంగా నిద్రపోయింది పార్వతి.

***

మర్నాడు ప్రొద్దుటే లేచి పనంతా తొందర తొందరగా ముగించుకుని ఎప్పుడు బ్యాంక్‌కి వెళదామా, ఎప్పుడు వాలంటరీ రిటైర్‌మెంట్ అప్లికేషన్ ఇద్దామా అనే ఆతృతతో బ్యాంకుకి వెళ్ళి హ్యాండ్ బ్యాగ్ తన టేబుల్‌పై పడేసి సరాసరి మేనేజరుగారి ఛాంబర్‌లోకి వెళ్ళి "గుడ్‌మార్నింగ్ సార్!" అంది మొహమంతా ముచ్చెమటలతో.



"వెరీ గుడ్‌మార్నింగ్. కూర్చోమ్మా. నిలబడతా వెందుకు?" చెప్పారు మేనేజరు.

"సార్..." నసిగింది పార్వతి.

"ఆ ఏమిటమ్మా! ఏమిటి! ఎనీ ప్రాబ్లమ్?" అడిగారు ప్రశ్నార్థకంగా. మేనేజరుగారికి పార్వతీ రాజశేఖరం దంపతులమీద ఎంతో గౌరవం వుంది.

"ఏంలేదు సార్! నేను వలంటరీ రిటైర్ అవుదామని..."

"అదేమిటి? మీకు ఇంకా చాలా సర్వీసు ఉందిగా! ఎందుకీ నిర్ణయం? ఇంత హడావుడిగా తీసుకున్నారు?" అడిగారు మేనేజరు ఆశ్చర్య పోతూ.

"ఉంది సార్. మీకు తెలియనిదేముంది? ఇంటి దగ్గర మావారొకరూ..." నీళ్ళు నమిలింది పార్వతి.


"ఓ... ఐ అండర్‌స్టాండ్. ఓకే నో ప్రాబ్లెమ్. చాలామంది పెట్టేస్తున్నారుగా. అయ్ విల్ ఫార్వర్డ్ యువర్ అప్లికేషన్ ఆల్‌సో" నవ్వుతూ అప్లికేషన్ తీసుకున్నారు.

'హమ్మయ్య... ఇప్పుడు నా గుండెలమీద నుండి ఎంతో బరువు తీసినట్లుందనుకుంది పార్వతి.

"థాంక్యూ సార్! థాంక్యూ వెరీమచ్" తన సీటులోకి వెళ్లి కూర్చుంది పార్వతి.

★★★





## ఇమేజ్ చిత్రం

ప్రముఖ తారల చిత్రాలు తక్కువైనా అడపాదడపా నటించే చిత్రాల్లో వారి నటనని చూడడానికి కళ్లు కాయలుకాచేలా చూస్తుంటారు అభిమానులు. ఐశ్వర్యారాయ్ చిత్రాలంటే బాలీవుడ్ ప్రేక్షకులకి ఎంతో ఆసక్తి. అమితాబ్ బచ్చన్, అక్షయ్‌కుమార్, అజయ్‌దేవగన్, తుషార్ కపూర్‌లు కలిసి నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఖాకీ' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. తన అభినయంతో అంతర్జాతీయ నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్యారాయ్ ఈ చిత్రంలో నటిస్తోంది. దీంతో ఆమె నటనగురించే అందరూ చర్చించుకుంటున్నారు. దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి ఈమె ఇమేజ్‌కి తగినట్టుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఆమెకున్న ఇమేజ్ ఈ చిత్రాన్ని ఘనవిజయం సాధించేట్టు చేస్తుందంటున్నారు. చూద్దాం ఏం జరుగుతుందో?

నెలరోజుల్లో పార్వతీ వలంటరీ రిటైర్‌మెంట్‌కి అనుమతిస్తూ లెటరు వచ్చింది. అంతే! అంతా ఇట్టే జరిగిపోయింది. మర్నాడు పార్వతిని రిలీవు చేయడం, మరో రెండు మాసాలలో ఆవిడకి రావలసిన అన్ని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేయడం జరిగిపోయింది.

ఇప్పుడు పార్వతి, రాజశేఖరంగారి అన్ని అవసరాలు దగ్గరుండి ఎంతో ప్రేమగా చూసుకుంటోంది.

పార్వతి బ్యాంకుకి వెళ్లిపోతే తను ఒంటరిగా టైము ఎలా గడపాలా అన్న రాజశేఖరంగారి దిగులుకి తెరపడింది.

ఇప్పుడు వారి జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతోంది. ఇద్దరూ అనేక తీర్థయాత్రలకి వెళ్లారు. ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నారు.

మళ్ళీ పెళ్లయిన కొత్తరోజులు జ్ఞాపకం వచ్చాయి. ఇల్లు పెద్దది కావడంవలన ఒక వాటా అద్దెకిచ్చారు. వాళ్ళు యువ దంపతులు. ఒక చిన్న బాబు, పేరు రాము. రాము అంటే రాజశేఖరంగారికి, పార్వతికి ఎంతో ఇష్టం. వాడు ఇద్దరికీ ఎంతో కాలక్షేపం.

రాము డాడీ, మమ్మీకి కూడా రాజశేఖరంగారన్నా, పార్వతి అన్నా ఎంతో గౌరవం. రాము ఎప్పుడూ వాళ్లింట్లోనే 'తాతయ్యా, మామ్మా!' అంటూ తిరుగుతుంటాడు. పార్వతికి పిల్లలులేని లోటు వయసు పెరుగుతున్నకొద్దీ తెలుస్తోంది. ఒకరోజు భర్తతో-

"ఏవండీ! పోనీ ఎవరినన్నా పెంచుకుందామా?" అడిగింది.

"ఇప్పుడా? నయం! మన పనులు మనమే చేసుకోలేకపోతున్నాం. పెంచే ఓపికలెక్కడున్నాయి?" కొట్టి పారేసారు రాజశేఖరంగారు.

***

కాలచక్రం గిర్రున పదేళ్ళు తిరిగింది. సాధారణంగా వయసుతోపాటు పెరిగే ఎదురయ్యే ఆరోగ్య సమస్యలే రాజశేఖరంగారికి, పార్వతికి ఎదురయ్యాయి

రాజశేఖరంగారికి పార్వతి ఆరోగ్యం మీద భయం పెరగసాగింది. ఎందుకంటే పార్వతికి ఈమధ్య ఎందుకో గుండెలో నొప్పి చాలాసార్లు వచ్చింది. పోనీ డాక్టర్ దగ్గరకు వెళ్లి చెకప్ చేయించుకుందాం రమ్మంటే "ఆ.. అదేదో గ్యాస్ట్రబుల్ అయ్యుంటుందిలెండి" అని కొట్టి పారేసింది.

ఒకరోజు సాయంత్రం ఇద్దరూ వాళ్లింటికి దగ్గరలోని పార్కుకి వెళ్లారు.

ఇద్దరూ మూలనున్న సిమెంటు బెంచీలమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నెమ్మదిగా చీకటి పడుతోంది.

"చూడు పార్వతీ! మెల్లమెల్లగా ఎలా చీకటి పడుతోందో? మన జీవితాలు కూడా ఇలాగే సాయంసంధ్యలోకి ప్రవేశించాయికదా" అన్నారు రాజశేఖరంగారు వైరాగ్యంగా. "పారూ! దేవుడు ఎంత కర్కశుడు. భార్యాభర్తలను అతి క్రూరంగా విడదీస్తాడు. ఒకరు లేకుండా ఇంకొకరు ఎలా బ్రతుకుతారనుకుంటాడో?"

"ఏమిటండీ! ఈవేళ ఇలా మాట్లాడతారు?" భయంభయంగా అంది పార్వతి.

"ఏంలేదు పార్వతీ! ఇప్పటివరకూ మనిద్దరం ఒకరికొకరు తోడుగా బ్రతికాము. ఒకరినొకరు ఒక్కరోజు కూడా విడిచి పెట్టలేదు. మనకా పిల్లలులేరు. ఒకవేళ మనిద్దరిలో ఏ ఒక్కరో ముందుగా..."

"ఇక చాల్లెండి. అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. వాడే చూస్తాడు! నాకా నమ్మకం వుంది. పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోక ఇంటికి పోదాం పదండి" లేచింది పార్వతి.

భారంగా అడుగులేస్తూ ఇంటి దారి పట్టారు రాజశేఖరంగారు, పార్వతి.


ఆ రాత్రే రాజశేఖరంగారి మాటలకు రెక్కలొచ్చేసాయి.

అర్ధరాత్రి పార్వతికి వున్నట్టుండి గుండెలో నొప్పి రావడం, క్షణాల్లో తీవ్రమవడం, రాజశేఖరంగారు ప్రక్కవాటా రామకృష్ణగారిని లేపడం, ఇద్దరూ కలిసి ఆటోలో పార్వతిని హాస్పిటల్‌కు తీసుకెళ్లడం ఇట్టే జరిగిపోయాయి. డాక్టర్‌గారు పార్వతిని పరీక్షించి అప్పటికే పార్వతి చనిపోయినట్లుగా చెప్పడంతో రాజశేఖరంగారు అక్కడే కుప్పకూలిపోయారు.

ఆయన్ని ఓదార్చడం ఎవరితరం కాలేదు. జరగవలసిన తతంగమంతా రామకృష్ణ, భార్య సహాయ సహకారాలతో ముగించారు. బంధువర్గమంతా వచ్చారు.

రాజశేఖరంగారికెంతో ధైర్యం చెప్పారు. 'ఏ మనిషికైనా ఇలాంటి కష్టాలు తప్పవన్నారు. మా ఇంటికొచ్చి ఒకటి రెండు నెలలుండండి. ఆ తరువాత అదే అలవాటైపోతుంది' అని కొందరు బంధువులు ఆహ్వానించారు.

"ఒకటి రెండు నెలలు. ఆహా! ఎంత ఉదారులు? ఏమి అనుబంధాలు? ఏమి ఆప్యాయతలు?" నవ్వుకున్నారు రాజశేఖరంగారు.



"నా బ్రతుకు నన్ను బ్రతకనివ్వండి. మీరు వెళ్లి మీమీ పనులు చూసుకోండి. నేనెక్కడికీ రాను. మీ ఆప్యాయతకు చాలా థాంక్స్" అని చెప్పేసారు రాజశేఖరంగారు.

రాజశేఖరంగారి జీవితంలో ఏదో చెప్పలేని వెలితి. పార్వతిలేని జీవితం నిస్సారంగా మారింది. క్షణక్షణం పార్వతి గుర్తుకు రాసాగింది. పుస్తకాలు, టీవీ, పూజ, ప్రక్కవాటా రామకృష్ణ కొడుకు రాము, పార్వతి జ్ఞాపకాలు ఇప్పుడాయన నేస్తాలు.

ఇంతలో ఒకరోజు ప్రక్కవాటా రామకృష్ణ, రాధ తను పేపరు చదువుతుంటే వచ్చారు.

"రండి! కూర్చోండి" ఆహ్వానించారు రాజశేఖరంగారు.

"ఏం సార్! ఎలా వున్నారు? మా గొడవల్లో మేముండి మిమ్మల్ని అసలు పట్టించుకోవడం లేదు. మీ ఆరోగ్యం ఎలా వుంది?" అడిగారు కుశలప్రశ్నలు.

"ఏమీ ఫర్వాలేదులెండి. మరచిపోయేది మానవ హృదయం కదా! మీ రాముతో నాకు బాగా కాలక్షేపం అవుతోంది. నాకిది చాలు."

"రాజశేఖరంగారు! మీరేమనుకోకపోతే ఒక చిన్న మాట అడగడానికి వచ్చాము" చెప్పారు రామకృష్ణ, రాధ.

"అడగండి. నా దగ్గర మీకు మొహమాటమెందుకు?"

"ఏంలేదు. మీరొక్కరూ వున్నారుకదా! ఈ వయసులో ఒక్కరూ ఉండడం ఎంత కష్టమో మేము ఊహించుకోగలం. మీకభ్యంతరం లేకపోతే మీరూ మాతో కలసి ఉండండి. మీరు మాకు తండ్రిలాంటివారు.

నాకూ నాన్నగారు పోయారు. మామగారు లేరు. అందుచేత మా రాముకి తాతయ్య లేని లోటు తీర్చినవారవుతారు. మీరు ఈ వయసులో వంట చేసుకుంటుంటే మేము చూడలేకపోతున్నాము. ఆలోచించుకోండి. కంగారేమీలేదు" రామకృష్ణ సావధానంగా చెప్పాడు.

'వీళ్ళు నా ఆస్తి మీద కన్నేసినట్లున్నారు. లేకపోతే ఏ సంబంధం లేకుండా ఇంత ప్రేమ ఎలా పుట్టుకొచ్చింది?' అని రాజశేఖరంగారు మనసులో అనుకుంటుంటే-

"మీ మనసులో సందేహం మాకర్థమైంది. మేము ఏ స్వార్థ ప్రయోజనం ఆశించి మీ దగ్గరకు రాలేదు. సుమారు అయిదు సంవత్సరాలనుండి మీ ఇంట్లో అద్దెకుంటున్నాము. మా గురించి ఈపాటికి మీకొక అభిప్రాయం వచ్చే వుంటుంది. మీ యావదాస్తినీ మీకు ఎవరైనా దగ్గర బంధువులు, ఆత్మీయులూ ఉంటే ఇచ్చేయండి. లేదా ఏ అనాథాశ్రమానికో, వృద్ధాశ్రమానికో, ఏ దేవాలయానికో... మీ ఇష్టం. మీకేది చేయాలనిపిస్తే ఆ పని చేయండి. ఆ తరువాతే మా ఇంటికి రండి. అప్పుడింక ఏ అనుమానాలకూ ఆస్కారం ఉండదు."

"నో! నో! అదేం కాదు బాబూ! మా పార్వతికి కూడా మీరన్నా, రాము అన్నా ఎంత ఇష్టమో నేను వేరే చెప్పక్కర్లేదు. మీకు శ్రమగలగ చేయడం ఎందుకని ఆలోచిస్తున్నానంతే! మీ ఆప్యాయతకు, అనురాగానికి నా హృదయం చలించిపోతోంది. నాకు ఒక్కరోజు గడువివ్వండి. నా నిర్ణయం రేపు చెబుతాను" గద్గదస్వరంతో అన్నారు రాజశేఖరంగారు.

"సరే సార్! తప్పకుండా ఆలోచించుకోండి. దీనిలో బలవంతం ఏమీలేదు. వస్తామండి" నిష్క్రమించారు రామకృష్ణ దంపతులు.

రాజశేఖరం నయనాలు ఆనందభాష్పాలతో అశ్రుపూరితమయ్యాయి. పార్వతి ఫోటో దగ్గరకు వెళ్లి వెక్కి వెక్కి ఏడ్చారు. "పారూ! ఆనాడు చివరిసారిగా నువ్వన్నావు చూడు... ఆ దేవుడే చూస్తాడని.

నీ మాట నిజమైంది పారూ! ఆ దేవుడే రామకృష్ణ, రాధల రూపంలో నన్ను చూస్తున్నారు. ఇక నాకు దిగులులేదు. నువ్వు నిశ్చింతగా ఉండు. ఆ దేవుడి పిలుపుకోసం ఎదురుచూస్తాను. వీలైనంత తొందరలో నీ దగ్గరకి వచ్చేస్తాను."

★★★

మర్నాడు ఉదయమే రాజశేఖరంగారు ప్రక్కవాటాలోకి "రామూ! మనవడా! ఏం చేస్తున్నావురా?" అంటూ వెళ్లారు.

"ఈవేళనుండి నేను నీకు తాతనురా" నవ్వుతూ సోఫాలో కూర్చున్నారు రాజశేఖరంగారు.


రాజశేఖరం నిర్ణయానికి రామకృష్ణ, రాధ ఎంతో సంతోషించారు.

"సరేగానీ మన వాటాల అడ్డు తలుపులు తీసేయండి" అన్నారు నవ్వుతూ.

"ఈరోజు నుండి నా మనవడి చదువు బాధ్యత నాదే" అన్నారు రాముని ఒళ్లోకి తీసుకుంటూ.

"ఈ శుభ సమయంలో మంచి కాఫీ త్రాగుదాం. రాధా! రెండు స్ట్రాంగ్ కాఫీ" నవ్వుతూ ఆర్డరిచ్చాడు రామకృష్ణ.


★



## వెరైటీ బైబిల్

ఇది కంప్యూటర్ యుగం కదా. అదో ఫ్యాషన్. బైబిల్ గ్రంథం మొత్తాన్ని చిన్న పాటి హ్యాండ్ కంప్యూటర్‌లో దాచుకునే బైబిల్ పాఠకులకు ఎంతో సౌకర్యం కల్పించిందండీ అమెరికాలోని ఫ్రాంక్లిన్ కంప్యూటర్ కంపెనీ. బైబిల్ కంప్యూటర్‌ని పుస్తకంలా ఎంచక్కా చేత్తో పట్టుకోవచ్చు. కావాల్సిన అధ్యాయాలు, సామెతలు స్క్రీన్‌లో చదవాల్సి వస్తే నిర్దేశించిన బటన్‌లు నొక్కడమే. తేలిగ్గా ఉంది కదా.

## కొత్తరకం రోబో



అగ్నిప్రమాదాలు ఎక్కువ అంతస్థులున్న భవనాల్లో జరిగినప్పుడు ఆ భవనాన్ని చేరుకోవడం మనకి కష్టం. అటువంటి సమయంలో గబగబా గోడల్ని పట్టుకుని పైకి ఎగబ్రాకగల రోబోని జపాన్‌వారు తయారుచేశారు. రెండు మీటర్ల పొడవు, 80 సెం.మీ వెడల్పు ఉండే ఈ రోబో అగ్నిదేవుని ఆహుతి నుండి అమాయక ప్రజల్ని తేలిగ్గా కాపాడేస్తుంది.

- శశి

